క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన చైర్మన్


వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డిని కనిగిరి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ గురువారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ నీటి రానున్న వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు రూ.25 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి స్పందిస్తూ నివేదికలు పంపాలని కోరారు. వైస్ చైర్మన్ రాచపుడి మాణిక్యరావు, కో ఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, కౌన్సిలర్లు రామనబోయిన శ్రీనివాసుల యాదవ్, పసుపులేటి అరుణోధర్, తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన నేతలు


వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న నేతలు

కొండపి: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని పార్టీ నేతలు గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి సూచనలు చేశారు. యువజన విభాగం జోనల్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, బొట్ల రామారావు, మండవ మాలకొండయ్య, యామవరపు వీర వసంత రావు తదితరులు ఉన్నారు.

243 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 243 బేళ్లు తిరస్కరణ గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు 1268 బేళ్లను వేలానికి తీసుకురాగా 1025 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.315, కనిష్ట ధర రూ.70, సరాసరి ధర రూ.217.65గా నమోదైంది. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయి.

సీజేఐపై దాడి హేయమైన చర్య


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

హనుమంతునిపాడు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు ఏసు, మస్తాను, మౌలాలి, శ్రీనివాసుల, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

కనిగిరిరూరల్: పట్టణంలోని శివారు కాలనీలో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బైక్ మెకానిక్‌గా పనిచేసే యువకుడు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొంత కాలంగా మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై టి.శ్రీరాం తెలిపారు.

పాఠశాలకు బీరువా అందజేత

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళయపల్లి ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఏరు చెంచయ్య రూ.10 వేల విలువైన బీరువాను అందజేశారు. గోపిరెడ్డి లక్ష్మిరెడ్డి ఎలక్ట్రికల్స్ పైప్స్, ఇతర సామాగ్రి రూ.10 వేలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న వీరిని ఎంఈఓలు సంజీవి, శ్రీనివాసచార్యులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగనాయకులు, స్వర్ణ రమణయ్య, పాఠశాల వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, వీరయ్య, ప్రసాదు, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కొండపి: దీపావళి బాణసంచా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఒంగోలు ఆర్డీఓ కళావతి అన్నారు. మండలంలోని చిన్న కండ్లగుంట గ్రామ సమీపంలో ఉన్న గోడౌన్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం స్టాక్ వివరాలను పరిశీలించారు. తహసీల్దార్ శీలం శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రంగ సాయి వాగు వద్ద ఉన్న మలుపు


కొండపి-పెద్దకండ్లకుంట గ్రామాల మధ్య ఎస్ ఆకారపు మలుపు వద్ద రివర్స్‌లో ఉన్న సూచిక బోర్డు

మలుపులు.. మృత్యు పిలుపులు

- రహదారికి ఇరువైపులా ఏపుగా పెరుగుతున్న పిచ్చిచెట్లు
- మలుపుల్లో మరింత ప్రమాదకరంగా చెట్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు...
- పట్టించుకోని అధికారులు


చోడవరం గ్రామ ప్రారంభంలో ఉన్న మలుపు వద్ద ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ఆటో (ఫైల్)

కొండపి:

మండలంలోని గ్రామీణ రహదారులకు ఇరువైపులా పనికిరాని పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మలుపుల వద్ద పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురు వచ్చే వాహనాలు కనిపించక తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని పెద్ద కండ్లగుంట జాళ్ల పాలెం గ్రామాల మధ్య సుమారు నాలుగు కిలో మీటర్లు, అనకర్లపూడి, నెన్నూరుపాడు గ్రామాల మధ్యలో మలుపుల వద్ద, కొండపి పెద్దకండ్లకుంట గ్రామాల మధ్యలో ఎస్ ఆకారంలో ఉన్న మలుపు వద్ద, వెన్నూరు చిన్న వెంకన్నపాలెం గ్రామాల మధ్య ఉన్న మలుపుల వద్ద పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు..

రోడ్లకు ఇరువైపులా చెట్లు పొదలు లాగా పెరిగి ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొండపి పెద్ద కండ్లకుంట గ్రామాల మధ్య ఉన్న ఎస్ ఆకారంలో ఉన్న మలుపు వద్ద గతంలో ఎన్నోసార్లు ప్రమాదాలు జరిగాయి. ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో కొంత మంది ప్రాణాలు కోల్పోగా మరికొంత మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఇప్పుడు అదే ప్రాంతంలో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి మలుపు కనిపించకుండా ఉన్నాయి. సూచిక బోర్డు ఒరిగి పిచ్చి చెట్ల మధ్యలో వ్యతిరేక దిశలో ఉంది. ఎదురుగా ఏ వాహనం వస్తుందో అసలు వాహనం వస్తుందో లేదో అర్థం కాక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఈ రహదారిలో ప్రయాణించేవారు ఆ మలుపు వద్దకు వచ్చేసరికి సూచిక బోర్డు కనిపించపోయేసరికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపి పెరిదేపి గ్రామాల మధ్య రంగసాయి వాగు వద్ద గతంలో అనేక ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో కూడా కొంతమంది మరణించగా కొంతమంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రాంతంలో కూడా పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో ఎప్పుడు ఏ ప్రమాదాలు సంభవిస్తాయని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. చోడవరం గ్రామం ప్రారంభంలో భారీ మలుపు ఉంది. గతంలో ఇదే మలుపు వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. జూలైలో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించకపోవడంతో బస్సు మినీ ఆటో ఢీకొన్నాయి. డ్రైవర్ల అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. వెన్నూరు నుంచి చిన్న వెంకన్నపాలెం వెళ్లే దారిలో వరుసగా రెండు మలుపులు ఉన్నాయి. ఈ రెండు మలుపుల వద్ద భారీ ఎత్తున పిచ్చిచెట్లు పెరిగి మలుపుల్లో అసలు వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కట్టవారి పాలెం, నేతివారిపాలెం గ్రామాల మధ్య కుంకుడు చెట్టు వద్ద ఉన్న మలుపు వద్ద కూడా అనేక ప్రమాదాలు సంభవించాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు, అద్దాలు,రేడియం స్టిక్కర్స్ అంటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపుల ఉన్న పిచ్చి పొదలను ఆయా గ్రామాల మలుపుల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు ప్రజాప్రతినిధులను అధికారులను కోరుతున్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



మండలంలోని అనేక గ్రామీణ రోడ్లలో మలుపుల వద్ద పిచ్చి చెట్లు ఏపుగా పెరిగాయి. కొన్ని మలుపుల వద్ద సూచిక బోర్డులు లేవు. రాత్రిళ్లు ఈ మలుపుల వద్ద కొత్తగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎదురు వచ్చే వాహనాలు అర్థం కాక మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగే మలుపుల వద్ద సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్స్, అద్దాలు బిగించాలి.

– **నజీర్**, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం మండల అధ్యక్షుడు

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

హనుమంతునిపాడు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరు రికార్డులు, ఇతర రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయంలోనే ఉండాలన్నారు. సమయపాలన పాటించని వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి షేక్ మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

శీతల గిడ్డంగుల్లో బేళ్ల వివరాలు తెలియజేయాలి

టంగుటూరు: శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన పొగాకు బేళ్ల వివరాలు తెలియజేయాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన వేలంలో తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకి చేందిన రైతులు 1154 బేళ్లను తీసుకురాగా 912 బేళ్లను కొనుగోలు చేసి 242 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 316, కనిష్ట ధర రూ.70 పలకగా, సరాసరి రూ.205.29 నమోదైంది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

హనుమంతునిపాడు: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలనీ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి జరిగే నిరాహార దీక్షలు, ధర్నాలు విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, ఏబు, ఏసు, మస్తాన్, జ్యోతి, గురవయ్య, రామయ్య, మౌలాలి, హిమామ్ సాహెబ్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు


పొన్నలూరులో తనిఖీ చేస్తున్న ఎస్సై అనూక్


పామూరులో తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

పొన్నలూరు: అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై అనూక్ అన్నారు. పొన్నలూరు, కె.అగ్రహారం సెంటర్లలోని దుకాణాల్లో గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగకు టపాసులు, బాణసంచా విక్రయించే వారు ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. గ్రామం మధ్యలో బాణసంచా షాపులు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగజేయకుండా గ్రామానికి దూరంగా షాపులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసుల నిబంధనలు పాటించకుంటే చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు.

పామూరు: అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం భీమానాయక్ హెచ్చరించారు. స్థానిక పలు దుకాణాలను గురువారం సీఐ భీమానాయక్, ఎస్సై టి.కిషోర్‌బాబు తనిఖీలు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ బాణసంచా నిల్వ ఉండాలంటే విధిగా అనుమతులు పొంది ఉండాలన్నారు. తాత్కాలికంగా బాణసంచా విక్రయించాలన్నా అనుమతులు తప్పనిసరన్నారు. జనావాసాల మధ్య బాణసంచా నిల్వ ఉంచకూడదని, ఇది ఎంతో ప్రమాదకరమన్నారు.

సీఎస్‌పురం(పామూరు): అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచితే వారిపై శాఖాపర చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం వెంకటేశ్వరనాయక్ అన్నారు. స్థానికంగా పలు దుకాణాల్లో గురువారం తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: అనుమతులు లేకుండా దీపావళి సామగ్రి నిల్వ ఉంచి, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. పట్టణంలోని పలు దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ లైసెన్సు లేకుండా మందుగుండు సామగ్రి నిల్వ ఉంచితే చట్టప్రకారం నేరమన్నారు. పట్టణంలోని టకారిపాలెం వద్ద ఉన్న పర్మినెంట్ లైసెన్స్ దుకాణం విజయలక్ష్మి క్రాకర్స్, స్టాక్‌ను పరిశీలించారు. ఏదైనా విపత్తు జరిగితే ఎలా స్పందిస్తారు, ఎలాంటి చర్యలు తీసుకుంటారని దానిపై మాక్ డ్రిల్ నిర్వహించారు. సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎస్సై టి.శ్రీరాం పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని చతుకుపాడు పరిదిలోని పోలేరమ్మ క్రాకర్స్ గోడౌన్‌ను గురువారం ఇన్‌చార్జి ఆర్డీఓ కళావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో స్టాకు రిజిష్టరు, ప్రమాద నివారణ యంత్రాలను, లైసెన్స్ కాలపరిమితిని పరిశీలించారు. తహశీల్దార్ పి.మురళీ, ఆర్ఐ ప్రసూన, వీఆర్‌ఓలు చైతన్య, మధు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో ప్రజల జీవితాలు నాశనం

కనిగిరిరూరల్: కూటమి నేతలు కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మద్యం మాఫియా రాజ్యమేలుతుందని, కల్తీ మద్యం ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి, ప్రైవేట్ షాపుల నుంచి బెల్టుషాపుల వరకు సరఫరా చేసి ప్రజల ప్రాణాలను తోడేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 16 నెలలకే చంద్రబాబు రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ధ్వజమెత్తారు. నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో కల్తీ మద్యం తాగి నలుగురు మృతి చెందినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదన్నారు. వీటి వెనుక టీడీపీ కీలక నేతలే ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు వైన్ షాపుల ద్వార కల్తీ మద్యం అమ్ముతుంటే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరు మెదపడం లేదన్నారు. ప్రభుత్వం ఎప్పటికైనా స్పందించి బెల్ట్ షాపులు రద్దు చేయాలని, కల్తీ మద్యాన్ని అరికట్టాలని దద్దాల డిమాండ్ చేశారు.

ఒక్క సమస్యా పరిష్కరించ లేదు..!


అధికారులను ప్రశ్నిస్తున్న కొణిజేడు ఎంపీటీసీ బుర్రా అంకరాజు


ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు

టంగుటూరు: మూడు నెలల క్రితం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల్లో ఒక్కటీ పరిష్కరించలేదని ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కుక్కల బెడదతో ప్రజలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కొణిజేడు ఎంపీటీసీ బుర్రా అంకరాజు మాట్లాడుతూ నాడు-నేడు రెండో విడత ఎంపికైన పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. దీంతో విద్యార్థులకు తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో కొణిజేడులో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా నిర్వహించలేదన్నారు. కేవలం మంత్రి స్వగ్రామానికి రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం ఏంటని పంచాయతీరాజ్ ఏఈని నిలదీయగా..ఆయన నుంచి సమాధానం కరువైంది.

గౌరవం లేదు..గౌరవ వేతనం లేదు.

'సమావేశాల్లో ఎంపీటీసీలకు గౌరవం లేదు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గౌరవవేతనం అందడం లేదు. అధికారులకు ఫోన్లు చేస్తే కనీసం స్పందించడం లేదు. మమ్మల్ని అవమానపరుస్తున్నారంటూ' ఇలా అయితే స్థానిక సంస్థలు ఎందుకని టంగుటూరి-4 ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వినూత్న రీతిలో మెడలో ప్లకార్డులు వేసుకొని నిరసన తెలియజేశారు. సమావేశంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ దేవసేనకుమారి, అధికారులు పాల్గొన్నారు.

క్విజ్‌లో కె.ఉప్పలపాడు విద్యార్థి సత్తా


మెమెంటోను అందుకుంటున్న శృతి లావణ్య

కొండపి: అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కొండపి మండలం కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సోమరాజుపల్లి శృతి లావణ్య ప్రథమస్థానం సాధించింది. ఈ సందర్భంగా లావణ్యను మండల విద్యాశాఖాధికారులు సురేఖ, రామారావు, ప్రధానోపాధ్యాయుడు సూసన్న కుమార్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

మొబైల్ యాప్ ద్వారా రుణ రికవరీలు


బయోమెట్రిక్ పరికరాలు అందజేస్తున్న డీజీఎం

కొండపి: స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను మొబైల్ యాప్ ద్వారా మాత్రమే చేయాలని స్త్రీ నిధి డీజీఎం అల్లు ఉమా మహేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి.గోపీనాథ్ అధ్యక్షతన సీసీలు, వీఏఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన స్త్రీ నిధి డీజీఎం ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ స్త్రీ నిధి విభాగంలో మండలంలో జిల్లాలో మంచి స్థానంలో ఉందని, ఇదే పనితీరు కొనసాగించాలని సూచించారు. ఈ ఏడాది రూ.6 కోట్ల రుణ విడుదల లక్ష్యం కాగా, రూ.15 కోట్ల వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. రుణాలన్నీ ఇక నుంచి నగదు రహిత లావాదేవీలను పాటిస్తూ రాష్ట్రస్థాయి నుంచి విడుదలైన మొబైల్ ఫోన్ యాప్ ద్వారా మాత్రమే రికవరీలు జరగాలని సూచించారు. ఇందువల్ల రికవరీల్లో అవకతవకలు జరగకుండా పారదర్శకత ఏర్పడి సభ్యులకు పూర్తి అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. స్త్రీనిధి మేనేజర్ ఎం శ్రీనివాసులు, సీసీలు డి.మల్లికార్జున, వి.కృష్ణారెడ్డి, గోవిందమ్మ, కె.రామానుజులు, రమణమ్మ, కోటేశ్వరమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకోండి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

కనిగిరిరూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని డీఈఓ ఏ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి, లింగారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలను గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు షెడ్యూల్‌కు అనుగుణంగా విద్యా బోధన, అభ్యసన స్థాయిలను పరిశీలింరు. కేరీర్ గైడెన్స్‌పై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

కిచెన్ గార్డెన్‌పై ప్రశంస..

లింగారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలోని కిచెన్ గార్డెన్‌ను డీఈఓ కిరణ్‌కుమార్ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పూలమొక్కలు, కూరగాయలు, పెరటి మొక్కల పెంపకాన్ని చూసి కిచెన్ గార్డెన్ బాగుందని హెచ్ఎం కోటిరెడ్డిని, ఉపాధ్యాయులను అభినందించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈఓలు రాజాల కొండారెడ్డి, డీవీ సుబ్బారావు, యువీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

కొండపి: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతాన్ని కోరుతూ గురువారం పెరిదేపి, మిట్టపాలెం గ్రామాల్లో ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబాలను గుల్ల చేస్తున్న మద్యం, మత్తు పదార్థాలను నిర్మూలించాలని, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న ఆకృత్యాలు అరికట్టాలని, మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో సమానత్వాన్ని కల్పించాలని మహాసభల్లో తీర్మానాలు చేస్తామన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగే మహాసభలకు రాష్ట్రంలోని మహిళా ఉద్యమ నేతలు 600 మంది హాజరవుతున్నారని తెలిపారు. మహాసభల జయప్రదానికి ప్రజలు అన్ని రకాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు అంగలకుర్తి విశ్రాంత, మాధవి, సునంద, సంపూర్ణ, ప్రమీల, పరిమళ, నల్లమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

టంగుటూరు: 'పెట్రోల్ బంకుల్లో వసతులు శూన్యం' కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ తహసీల్దార్, కంపెనీల ప్రతినిధులు సూరారెడ్డిపాలెంలోని శ్రీకర ఫిల్లింగ్ స్టేషన్, టంగుటూరులోని చలపతి పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేశారు. ఈ రెండు పెట్రోల్ బంకుల్లో ఉచిత గాలి సౌకర్యాన్ని అందించడంలో టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, వినియోగదారులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ పోటీలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం పీఎం రసూల్ అధ్యక్షతన మండలస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆటలపోటీలను ఎంఈఓ జె.ప్రసాదరావు ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలకుకూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కాగా అండర్-14, అండర్-17 బాల, బాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. హెచ్ఎంలు ఓ.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, షేక్.షరీఫ్, జి.వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 25 బెంచీల అందజేత

పామూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాతలు రు.లక్ష విలువైన 25 బెంచీలను గురువారం ఎంఈఓ, పాఠశాల హెచ్ఎం కోటిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దాతలు యారవ శ్రీనివాసులు 10 బెంచీలు, మాజీ సర్పంచ్ సోమిశెట్టి నారాయణ 10 బెంచీలు, కొప్పరపు వెంకట సుబ్బారావు 5 బెంచీలను తమ సొంత నిధులతో సమకూర్చి ఎంఈఓకు అందజేశారు. పువ్వాడి వెంకటేశ్వర్లు, బైరెడ్డి జయరామిరెడ్డి, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, కొండిశెట్టి వెంకటరమణయ్య, మెంటా నరసింహారావు, ఇండ్ల సత్యం, దర్శి ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వేములపాడు ఘాట్‌రోడ్డు మలుపు వద్ద సిమెంట్ లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే..కడప జిల్లా జమ్మలమడుగు నుంచి శ్రీ బాలాజీ ట్రావెల్స్ లారీ సిమెంట్ లోడుతో పొదిలి వెళ్తుంది. ఆ సమయంలో ఘాట్ దిగే సమయంలో మలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడింది. టైర్ పంక్చర్ కావడంతో లారీ పక్కకు వరిగి కిందపడింది. డ్రైవర్ షేక్ షఫీకి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌ది చిత్తూరు జిల్లా సత్యవేడు.